సాక్షి
ఖమ్మం

శుక్రవారం । 2 । మే । 2025



వరుణుడి పాలైన ధాన్యం

జిల్లాలోని వైరా నియోజకవర్గంలోని మండలాలతో పాటు పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి గాలిదుమారంతో కురిసిన అకాల వర్షం రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. వైరా మార్కెట్ యార్డులో ఆరబోసిన వేల కొద్ది క్వింటాళ్ల ధాన్యం తడిసి ముద్దవగా.. ఇతర చోట్ల కల్లాల్లో ఆరబోసిన వడ్లు కూడా తడిశాయి. అలాగే, వివిధ గ్రామాల్లో కోతకొచ్చిన బొప్పాయి తోటలు నేలకూలగా రైతులు కన్నీరుమున్నీరయ్యారు. 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మూడు రోజుల పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం సాయంత్రం ఖమ్మంలో ఐటీ హబ్ నుంచి ఎన్‌టీఆర్ సర్కిల్ వరకు ఫుట్‌పాత్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్, టేబుల్ టెన్నిస్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశాక సీఎం కప్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తారు. శనివారం ఉదయం ఖమ్మం 44వ డివిజన్ రైతు మార్కెట్‌లో షెడ్ల నిర్మాణం, టేకులపల్లిలో సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, ఆదివారం ఉదయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ, కొత్తగూడెంలో పలు కార్యక్రమాలకు హాజరుకానున్న మంత్రి, 10–30 గంటలకు పోస్టాఫీస్ సెంటర్‌లో చేకూరి కాశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.

ఉత్తీర్ణత పెరిగితేనే నమ్మకం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రత్యేకాధికారి, డీఐఈఓ, అధ్యాపకులు

బోనకల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంపు ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో మెరుగైన విద్య అందుతుందనే నమ్మకం ఏర్పడుతుందని ఇంటర్ బోర్డు ప్రత్యేకాధికారి యాదగిరి సూచించారు. జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారి రవిబాబుతో కలిసి గురువారం ఆయన బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా వారు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచడం ద్వారా తల్లిదండ్రుల్లో నమ్మకం ఏర్పడుతుందని తెలిపారు. ఈ దిశగా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ నళిని, అధ్యాపకులు పాల్గొనగా, వచ్చే విద్యాసంవత్సరం ప్రవేశ కరపత్రాలను ఆవిష్కరించారు.

గురుకులాల ఆర్‌సీఓగా అరుణకుమారి



అరుణకుమారి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఖమ్మం రీజియన్ గిరిజన సంక్షేమ గురుకులాల సమన్వయ అధికారి(ఆర్‌సీఓ)గా అరుణకుమారి నియమితులయ్యారు. గతంలో ఆర్‌సీఓగా పనిచేసిన నాగార్జునరావును మేడ్చల్‌కు బదిలీ చేయగా, ఆ స్థానంలో దమ్మపేట మండలం అంకంపాలెం గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారిని నియమించారు. ఈ విషయాన్ని గురుకులాల పరిపాలనాధికారి నరేందర్ తెలిపారు.

'ఎర్లీబర్డ్' గడువు పొడిగింపు

ఖమ్మంమయూరిసెంటర్: ముందస్తుగానే వంద శాతం ఆస్తిపన్ను చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ ఇచ్చేలా ప్రభుత్వం తీసుకొచ్చిన ఎర్లీబర్డ్ స్కీం గడువును ఈనెల 7వ తేదీ వరకు పొడిగించారు. ఈ విషయమై ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో పాటు ఇతర మున్సిపాలిటీల కమిషనర్లకు ఫోన్ ద్వారా ఉన్నతాధికారులు సమాచారం ఇచ్చారు. దీంతో కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీలకు ఆదాయం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. కాగా, ఎర్లీబర్డ్ ద్వారా కేఎంసీకి ఏప్రిల్‌లో రూ.10.13 కోట్లు ఆదాయం సమకూరిందని వెల్లడించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య.. ఇందుకు కృషి చేసిన అధికారులు, ఉద్యోగులను అభినందించారు.

డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన 'సామినేని'



డీఈఓను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఈఓగా ఉన్న సోమశేఖరశర్మ ఉద్యోగ విరమణ చేయడంతో డైట్ ప్రిన్సిపాల్ సత్యనారాయణను ఆ స్థానంలో నియమించారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. కాగా, విద్యావ్యవస్థను పటిష్టంలో చేయడంలో భాగంగా డీఈఓలకు శిక్షణ నిర్ణయించారు. ఈక్రమంలో శుక్రవారం మొదలయ్యే శిక్షణకు సత్యనారాయణ వెళ్తున్నారు.

ఇళ్ల కోసం లొల్లి..

ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసనలు, నిలదీతల పర్వం కొనసాగుతోంది. అన్ని అర్హతలు ఉన్నా.. జాబితాలో తమకు ఎందుకు స్థానం దక్కలేదని పంచాయతీ కార్యదర్శులతో పాటు సర్వేకు వచ్చిన అధికారులను నిలదీస్తున్నారు. అంతేకాక అనర్హులకు చోటు కల్పించారని ఇందిరమ్మ కమిటీ సభ్యులపై మండిపడుతున్నారు. ఈక్రమంలో మండల, జిల్లాస్థాయిలో ప్రజావాణికి సైతం ఫిర్యాదులు అందుతున్నాయి. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం

'ఇందిరమ్మ' జాబితాపై మిన్నంటుతున్న నిరసనలు

- అర్హులకు స్థానం దక్కలేదని ఆగ్రహం
- జిల్లాలోని పలు గ్రామాల్లో వరుస ఆందోళనలు



మూడు కేటగిరీల్లో ఎంపిక

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికను మూడు కేటగిరీల్లో నిర్వహించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. సొంత స్థలం ఉండి.. గుడిసె, రేకులషెడ్, టైల్స్ వేసిన, అద్దె ఇళ్లలో ఉండే వారిని ఎల్–1 కేటగిరీగా, గుడిసెలు, రేకులషెడ్లు, టైల్స్ వేసిన ఇళ్లు, అద్దె ఇళ్లల్లో ఉంటూ స్థలం కూడా లేని వారిని ఎల్–2గా, ఇళ్లు ఉండి, తల్లిదండ్రుల నుంచి విడిపోయి తమకు ఇళ్లు కావాలని దరఖాస్తు చేసుకున్న సంతానాన్ని ఎల్–3 కేటగిరీలో చేర్చారు. ఈ జాబితా ఆధారంగా అర్హులను ఎంపిక చేసి కలెక్టర్‌కు ఇస్తుండగా.. ఆపై ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రులు, ఇన్‌చార్జి మంత్రి పరిశీలించాక ఖరారు చేస్తారు. తొలుత ఎల్–1 కేటగిరీకి ప్రాధాన్యత ఇస్తామని ముందుగా వెల్లడించారు.

జాబితాలో పేర్లు లేకపోవడంతో..

మూడు కేటగిరీలతోపాటు కొత్తగా అందిన దరఖాస్తులు కలిపి జిల్లాలో 70,167మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. అయితే, తాజాగా విడుదల చేసిన జాబితాల్లో పేర్లు లేకపోవడంతో ఇళ్ల కోసం గంపెడాశలు పెట్టుకున్న నిరుపేదలకు ఆగ్రహం కలిగి స్తోంది. దశాబ్దాలుగా సొంత ఇల్లు లేక, కూలీ పనులు చేసుకుని జీవిస్తున్న తమకు అన్యాయం జరిగిందని వాపోతున్నారు. ఏ ప్రాతిపదికన లబ్ధిదారులను ఎంపిక చేశారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగాలు చేస్తున్న వారు, గతంలోనే ఇళ్లు ఉన్న వారిని ఎంపిక చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇష్టం వచ్చిన వారికే కేటాయించారని ఆరోపిస్తున్నారు.

అధికారుల నిర్బంధం, నిలదీతలు..

లబ్ధిదారుల ఎంపికకు కేటగిరీలుగా విభజించి సర్వే చేస్తుండగా.. జాబితాలో ఎక్కువగా అనర్హులే ఉన్నారని నిరసనలు వ్యక్తవుతున్నాయి. జాబితా పరిశీలనకు వచ్చే అధికారులను నిలదీస్తూనే.. జిల్లా పర్యటనకు వస్తున్న మంత్రులకు ఇదే విషయంలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అలాగే ఇతర పార్టీల నేతల వద్దా ప్రజలు గోడు వెళ్లబోసుకుంటున్నారు. మండల, జిల్లాస్థాయి గ్రీవెన్స్‌లో సైతం అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లపైనే ఫిర్యాదులు వస్తున్నాయి.

అధికారుల అడ్డగింత

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనర్హులకు స్థానం కల్పించారంటూ తల్లాడ మండలం అన్నారుగూడెం వాసులు అధికారులను గురువారం నిలదీశారు. గ్రామానికి 40ఇళ్లు మంజూరైతే, జాబితాలో అందరూ అనర్హులే ఉన్నారని ఇటీవల సత్తుపల్లి ఎమ్మెల్యే, ఆర్‌డీఓకు 18 మంది ఫిర్యాదు చేశారు. దీంతో వారి సూచనల మేరకు ఎంపీడీఓ సురేష్‌బాబు, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు విచారణ కోసం గురువారం గ్రామానికి వస్తుండగా కాలనీ ప్రారంభంలోనే దళిత కాలనీ మహిళలు కారును అడ్డుకున్నారు. అయితే, విచారణ కోసమే వస్తున్నామని, అర్హులందరికీ ఇళ్లు అందుతాయని చెప్పడంతో మహిళలు అడ్డు తొలిగారు.

■ పంచాయతీకి తాళం వేసి..



ముదిగొండ మండలం వనంవారి కిష్టాపురంలో ఇటీవల స్థానికులు గ్రామపంచాయతీ కార్యదర్శిని కార్యాలయంలో నిర్బంధించారు. ఇందిరమ్మ కమిటీలోని ముగ్గురు.. మిగతా సభ్యులకు తెలియకుండా అనర్హులను ఎంపిక చేశారని ఆరోపించారు. పొలాలు, ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగం ఉన్న వారికి ఇళ్లు కేటాయించారని, అర్హుల పేర్లు లేవని ఆందోళన చేశారు. ఆ తర్వాత పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామపంచాయతీ తాళం తీయించారు.

■ అనర్హులే ఉన్నారని...



ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హుల పేర్లు రాలేదని, అనర్హుల పేర్లు ఉన్నాయని ఆరోపిస్తూ బోనకల్ మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో బుధవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు, అర్హులకు ఇళ్లు మంజూరు చేయకుండా కాంగ్రెస్ నాయకులు వారికి ఇష్టం వచ్చిన వారి పేర్లు రాసుకున్నారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

■ పదేళ్ల నుంచి ఇంటి కోసం..



పై ఫొటోలోని వృద్ధురాలు ముదిగొండ మండలం వనంవారి కిష్టాపురం గ్రామానికి చెందిన పొట్లపల్లి పుల్లమ్మ. ప్రజాపాలన సభలో ఇంటికోసం దరఖాస్తు చేసుకుంది. భార్యాభర్తలు ఇద్దరూ కేన్సర్ బాధితులు. సెంట్ భూమి కానీ ఇల్లు కానీ లేదు. ఇప్పుడు ఇందిరమ్మ అర్హుల జాబితాలో పేరు లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. పదేళ్ల నుంచి కోసం ఎదురుచూస్తుండగా.. పేదలమైన తమకు ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

కేటగిరీల వారీగా అర్హులు, కొత్త దరఖాస్తుల వివరాలు	మూడు కేటగిరీల్లో అర్హులు	ఎల్-1	ఎల్-2	ఎల్-3	నూతన దరఖాస్తులు	మొత్తం
	65,751	53,445	3,191	9,115	4,416	70,167

రామయ్యా.. వస్తున్నామయ్యా

- భద్రగిరికి పెరుగుతున్న భక్తజనం
- ఏప్రిల్‌లో స్వామిని దర్శించుకున్న 2.78 లక్షల మంది



శ్రీరామనవమి రోజున భద్రగిరిలోని ఓ వీధిలో కిక్కిరిసిన భక్తులు(ఫైల్)

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి క్రమంగా భక్తుల ఆదరణ పెరుగుతోంది. దీంతో హుండీ ఆదాయం సైతం అధికమవుతోంది. గతంలో శని, ఆదివారాల్లో మాత్రమే భక్తుల సందడి ఉండేది. ప్రస్తుతం వారంలో ఐదు రోజులకు తగ్గకుండా భక్తులు స్వామిని దర్శించుకుంటున్నారని గణాంకాలు చెబుతున్నాయి.

గత నెలలో 2.78లక్షల మంది..

ఈ ఏడాది ఏప్రిల్‌లో 2,78,730 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు. గతేడాది ఏప్రిల్‌లో 2,27,730 మంది భద్రగిరి బాట పట్టారు. అంటే ఈసారి 50 వేల మంది భక్తులు అధికంగా వచ్చారు. ఏప్రిల్ 6, 7వ తేదీల్లో శ్రీరామనవమి, స్వామివారికి పట్టాభిషేక మహోత్సవాలు జరిగాయి. దీంతో పాటు 23వ తేదీ నుంచి వేసవి సెలువులు ప్రారంభం కావడంతో భక్తుల సంఖ్య పెరిగిందని అంచనా. ఇక శని, ఆదివారాల్లో పదివేల మందికి పైగానే రామయ్య దర్శనానికి వస్తుండడం విశేషం.

రెట్టింపవుతున్న హుండీ ఆదాయం..

భక్తుల రాకతో పాటు ఆలయ హుండీ ఆదాయం సైతం పెరుగుతోంది. గతంలో సుమారు నెల రోజులకు రూ.40లక్షల నుంచి రూ.50లక్షల వరకు కానుకల ద్వారా వచ్చేవి. కానీ ఈ ఆదాయం దాదాపు రెట్టింపైంది. మార్చి 19న హుండీ లెక్కించగా 43 రోజులకు రూ.1.14 కోట్ల ఆదాయం సమకూరింది. ఆర్జిత సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదాల విక్రయం, వసతి గదుల అద్దెలు ఇంకా అదనం. ఇక శ్రీరామనవమి తర్వాత ఆదాయం లెక్కించాల్సి ఉంది. ఈఓ రమాదేవి ఆధ్వర్యాన భక్తులకు కల్పించిన వసతులు, పారదర్శకత ఇందుకు ప్రధాన కారణమని పలువురు భావిస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలు తదితరుల పేరిట వస్తున్న వారిని కట్టడి చేస్తున్నారు. ఎంతటి ప్రముఖుల సిఫారసు లేఖలైనా ముందుగా నమోదు చేయించి, బయోమెట్రిక్ ద్వారా ఫొటోలు దిగాకే దర్శనం కల్పిస్తుండడంతో వీఐపీల పేరిట వచ్చే వారి తాకిడి తగ్గి, సామాన్యులకు ప్రాధాన్యత దక్కుతోంది. ఇక స్వామివారికి సమర్పించే వస్త్రాల విక్రయానికి సైతం బార్‌కోడ్ ప్రవేశపెట్టి అవకతవకలకు చెక్ పెట్టారు. ఈనేపథ్యంలోనే గతేడాది కంటే ఈసారి శ్రీరామనవమికి టికెట్లు, ఇతర సేవల ద్వారా రూ.80 లక్షల ఆదాయం పెరిగింది. వసతిగదుల ద్వారా కూడా కీలక రోజుల్లో రూ.50 వేలకు పైగానే సమకూరుతోంది.

దాతలకు ప్రాధాన్యత ఇస్తే..

భద్రగిరి అభివృద్ధిలో దాతలకు సరైన ప్రాధాన్యత లభించడం లేదనే అపవాదు ఉంది. దీంతో నిత్యాన్నదానం, గోశాలకు మాత్రమే విరాళాలు అందుతున్నాయి. ఏడాదికోసారి దాతలను సత్కరిస్తున్నా.. ఆలయం అభివృద్ధి చెందాలంటే వారిని మరింతగా ఆదరించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన వసతులు, ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న వారిని రిక్రూట్ చేయడం ద్వారా దేవస్థానానికి వచ్చే వివిధ ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు, వీవీఐపీల ద్వారా విరాళాలు రాబట్టవచ్చని పలువురు సూచిస్తున్నారు. దీనిపై దేవాదాయ శాఖ కమిషనర్, ఈఓ ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో క్రీడా వసతులు

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- వీ.వీ.పాలెం పాఠశాలలో సమ్మర్ క్యాంప్ ప్రారంభం



విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడుతున్న కలెక్టర్

రఘునాథపాలెం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదునిచ్చేలా అవసరమైన వసతులు కల్పిస్తామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించగా, ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులతో మాట్లాడి కాసేపు ఆయన కూడా ఆడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఓటమి అంచుకు చేరినా పట్టుదల ఉంటే విజయం సాధించొచ్చన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీవైఎస్‌ఓ సునీల్ రెడ్డి, కోచ్ ఆదర్శకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. రఘునాథపాలెం మండలంలోని పాపటపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం తనిఖీ చేసిన ఆయన నిర్దేశిత తేమ రాగానే కాంటా వేసి మిల్లులకు తరలించాలని తెలిపారు. ఎక్కడైనా తేమ, తాలు పేరిట కోత విధించినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, ఏపీఎం విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు తేలడంతో చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ సన్యాసయ్యను ఆదేశించారు. ఏఓ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రఘునాథపాలెంలోని పల్లె దవాఖానా – ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని కలెక్టర్ తనిఖీ చేసి మందుల నిల్వలు, గర్భిణులు, సాధారణ ప్రజలకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. సాధారణ ప్రసవాలతో లాభాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

కోడ్లు వద్దు.. ఎనిమిది గంటలే మేలు

మే డే సభలో తమ్మినేని వీరభద్రం



సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రం అమల్లోకి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి, ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. సీపీఎం ఖమ్మం త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యాన గురువారం మే డే సందర్భంగా స్థానిక బోస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక సంక్షేమానికి తూట్లు పొడిచేలా చట్టాలు తెస్తే కార్మిక వర్గం మొత్తం తిరగబడుతుందని హెచ్చరించారు. పెట్టుబడిదారి వర్గాలతో బీజేపీ ప్రభుత్వం కుమ్మక్కై 44 చట్టాలుగా ఉన్న కార్మిక చట్టాలను కుదించి నాలుగు కోడ్లుగా మార్చిందని ఆరోపించారు. ఇకనైనా కోడ్లను రద్దుచేయాలని.. లేనిపక్షంలో తిరుగుబాటు తప్పదని తెలిపారు. ఈవిషయమై 25వ తేదీన జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మిక లోకం పాల్గొనాలని తమ్మినేని పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సాయిబాబా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు వై.విక్రమ్, బి.శ్రీనివాస్, యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'నీట్' కు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో ఆరు కేంద్రాలు, 2,739 మంది విద్యార్థులు
- అధికారులతో సమీక్షించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: వైద్య కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 4న జరిగే నీట్ యూజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. క్యాంపు కార్యాలయం నుంచి గురువారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈనెల 4న మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకు జరిగే పరీక్ష కోసం జిల్లాలో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 2,739 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. అధికారులు ఒక రోజు ముందుగానే కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించి, సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించాలని చెప్పారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1–30 గంట వరకే విద్యార్థులను అనుమతించనున్నట్లు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.

విద్యార్థులకు సూచనలు

విద్యార్థులు అడ్మిట్ కార్డ్ ప్రింట్ కాపీతో రావాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. లేనిపక్షంలో కేంద్రంలోకి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ttps://neet.nta.nic.in పోర్టల్ నుంచి అడ్మిట్ కార్డ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. దీంతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పోస్ట్ కార్డు సైజు ఫొటో ఒకటి, ఫొటోతో కూడిన ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని, షూస్, బెల్ట్, ఆభరణాలు లేకుండా రావాలని సూచించారు. అలాగే, హాఫ్ హ్యాండ్స్ షర్ట్‌లు మాత్రమే వేసుకోవాలని తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, నీట్ జిల్లా నోడల్ అధికారి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నీట్ కేంద్రాల వద్ద సెక్షన్ 163

ఖమ్మంక్రైం: వైద్య కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 4న నిర్వహిస్తున్న నీట్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమల్లో ఉంటుందని పోలీసుల కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. మధ్యాహ్నం 12నుంచి రాత్రి 8గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉండనున్నందున కేంద్రాలకు 200 మీటర్ల మేర ఐదుగురికి మించి గుంపుగా నిలవొద్దని, సభలు, ర్యాలీలు, మైక్‌లతో ఊరేగింపులకు అనుమతి ఉండదని పేర్కొన్నారు. అంతేకాక కేంద్రాల సమీపాన ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ షాప్‌లు మూసివేయాలని సూచించారు. అలాగే, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకోనున్నామని తెలిపారు.

క్లుప్తంగా

కులగణన నిర్ణయం చరిత్రాత్మకం



పాలాభిషేకంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: జనాభా లెక్కలతో పాటే కులగణన చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించడం చారిత్రకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఖమ్మంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశాక ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టడం ద్వారా బడుగు, బలహీన వర్గాలకి న్యాయం జరుగుతుందని తెలిపారు. అయితే, దీన్ని కాంగ్రెస్ ఘనతకు చెప్పుకుంటున్న ఆ పార్టీ నాయకులు యూపీఏ పాలనలో ఎందుకు చేయలేదో సమాధానం చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈ.వీ.రమేష్, డాక్టర్ శీలం పాపారావు, జ్వాల నర్సింహారావు, అల్లిక అంజయ్య, శ్యాం రాథోడ్, మందడపు సరస్వతి, రుద్ర ప్రదీప్, పమ్మి అనిత, రీగన ప్రతాప్, వీరెల్లి రాజేష్‌గౌడ్, మందడపు సుబ్బారావు, మేకల నాగేందర్, యుగంధర్ పాల్గొన్నారు.

భూ సర్వేను అడ్డుకున్న రైతులు



అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

రఘునాథపాలెం: నాగపూర్–అమరావతి నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా రఘునాథపాలెం మండలంలో గురువారం సర్వేకు వచ్చిన ఉద్యోగులను రైతులు అడ్డగించారు. భూసేకరణపై తాము కోర్టును ఆశ్రయించగా స్టే విధించినా సర్వే చేయడం ఏమిటని ప్రశ్నించారు. భూముల్లోని చెట్లు, బావుల లెక్క తేల్చేందుకు సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తదితరులు సర్వేలో పాల్గొనగా, ఇది స్టే ఉన్న భూమి అని రైతులు స్పష్టం చేయడంతో వారు వెనుదిరిగారు. అనంతరం రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం నోటీసులు ఇవ్వకుండానే సర్వే చేయడం సరికాదని, ఇకనైనా ఇలాంటి ప్రయత్నాలు మానుకోవాలని కోరారు.

చెక్‌పోస్టు వద్ద ప్రైవేట్ వ్యక్తులతో వసూళ్లు

హోంగార్డ్‌ను నిలదీసిన వాహనదారులు

వైరారూరల్: చెక్‌పోస్టు వద్ద ఓ హోంగార్డు ప్రైవేట్ వ్యక్తులను పెట్టి వాహనదారుల నుంచి డబ్బు వసూలు చేయించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వైరా మండలంలోని గన్నవరం, దాచాపురం సరిహద్దు మీదుగా ఏపీ నుంచి ధాన్యం అక్రమ రవాణా జరగకుండా పోలీస్, వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యాన రెండు రోజుల క్రితం చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఇక్కడ పోలీసులు రెండు షిఫ్టులుగా విధులు నిర్వర్తిస్తుండగా, గురువారం మధ్యాహ్నం విధుల్లో ఉన్న ఓ హోంగార్డు నలురు ప్రైవేట్ వ్యక్తులను పెట్టి వాహనదారుల నుంచి డబ్బుల వసూళ్లు మొదలుపెట్టినట్లు తెలిసింది. ఎవరైనా వాహనాలు ఆపకపోతే సదరు ప్రైవేట్ వ్యక్తులు దూషిస్తుండగా కొందరు ఆగ్రహించినట్లు సమాచారం. హోంగార్డుతో పాటు ప్రైవేట్ వ్యక్తులతో వాగ్వాదానికి దిగగా.. సమాచారం అందుకున్న వైరా పోలీసులు చేరుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అప్పు చెల్లించే క్రమాన చెల్లని చెక్కు జారీ చేసిన వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం ఒకటో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి బి.రజని గురువారం తీర్పు చెప్పారు. ఖమ్మం బుర్హాన్‌పురానికి చెందిన బొందిలి కేసరసింగ్ వద్ద శాంతినగర్ వాసి దొడ్డ రామారావు 2020 ఏప్రిల్‌లో రూ.9 లక్షల అప్పు తీసుకున్నాడు. తిరిగి 2021 నవంబర్ 6న రూ.9లక్షలకు చెక్కు జారీ చేసినా ఆయన ఖాతాలో సరిపడా నగదు లేకపోవడంతో తిరస్కరణకు గురైంది. దీంతో కేసరసింగ్ తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. విచారణ అనంతరం రామారావుకు జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.9లక్షలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సూపర్‌వైజర్‌ను హతమార్చిన మావోలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు మరో దారుణానికి ఒడిగట్టారు. బలరాంపూర్ జిల్లా సరిహద్దు ప్రాంతంలోని జార్ఖండ్‌లో రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న సూపర్‌వైజర్‌ను గురువారం కాల్చి చంపారు. ముహువాడ పోలీస్ స్టేషన్ పరిధి ఓర్సాపత్ గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకోగా, సూపర్‌వైజర్‌ను కాల్చి చంపడమే కాక జేసీబీని దగ్ధం చేశారు. కొన్నాళ్ల క్రితం రోడ్డు పనులు నిలిపివేయాలంటూ మావోయిస్టులు హెచ్చరించగా, భద్రతా బలగాల నడుమ పనులు చేస్తున్నారు. దీంతో సూపర్‌వైజర్‌ను హతమార్చినట్లు తెలిసింది.

అకాల వర్షం.. అల్లకల్లోలం



వైరా మార్కెట్‌లో తడిసిన ధాన్యం బస్తాలు



తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతు

- వైరా మార్కెట్‌లో నీటి పాలైన ధాన్యం
- 3 వేల క్వింటాళ్ల మేర తడిసినట్లు అంచనా
- ఇంకొన్ని మండలాల్లోనూ ప్రభావం

వైరా: కనీస మద్దతు ధర కల్పించేలా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుచేస్తే.. ప్రకృతి మాత్రం రైతులను కనికరించడం లేదు. వైరాతో పాటు నియోజకవర్గంలోని కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు మండలాల్లో బుధవారం రాత్రి కురిసిన వర్షంతో ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. వైరా మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు మందకొడిగా సాగుతుండడంతో పెద్దమొత్తంలో పేరుకుపోయాయి. దీనికి తోడు గన్నీసంచులు లేకపోవడం, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు చేర్చకపోగా.. ఆరబోసిన ధాన్యంపై కప్పేందుకు పట్టాలు కూడా సమకూర్చలేదు. దీంతో అకాల వర్షంతో వైరా మార్కెట్‌లో సుమారు 3వేల క్వింటాళ్లపైగా ధాన్యం తడిసినట్లు చెబుతున్నారు. కాగా, కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని ఇటీవల ఆందోళన చేసినా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైందని రైతులు వాపోయారు.

ఆరబోసిన ధాన్యం తడిసింది..



మార్కెట్‌లో ఐదు రోజుల క్రితం ధాన్యాన్ని ఆరబోశా. రాత్రి కురిసిన అకాల వర్షంతో 35 బస్తాల ధాన్యం పూర్తిగా తడిసింది. మళ్లీ ఆరబెట్టి తేమ తగ్గాక అమ్మడానికి ఎన్ని రోజులు పడుతుందో తెలియదు. ముందే ధాన్యం కొంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. – ఆర్.మురళి, బ్రహ్మణపల్లి

పట్టాలు ఇవ్వలేదు..



మార్కెట్‌కు ధాన్యాన్ని అమ్ముకునేందుకు తీసుకొచ్చాం. కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయని తెలిసినా.. ఒక్కసారిగా వర్షం వస్తే ధాన్యంపై కప్పేందుకు కనీసం పట్టాలు కూడా ఇవ్వలేదు. దీంతో వర్షానికి పూర్తిగా ధాన్యం తడిచిపోయింది. ఇప్పుడు మాకెవరు దిక్కు. – బి. నాగేశ్వరరావు, వైరా

60 బస్తాల ధాన్యం కొట్టుకుపోయింది



మూడు రోజుల ధాన్యం తీసుకొస్తే గన్నీ సంచులు లేవన్నారు. ధాన్యం ఇప్పుడు కొనే పరిస్థితి లేనందున వారం రోజులు ఆగాల్సిందేనని చెప్పడంతో యార్డు చివరిలో ఖాళీగా ఉన్న చోట ఆరబోశాను. అకాల వర్షంతో 60 బస్తాల ధాన్యం కొట్టుకుపోయింది. – పి.అప్పారావు, సోమవరం

కొణిజర్ల మండలంలో...

కొణిజర్ల: కొణిజర్ల మండలంలో బుధవారం అర్ధరాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. తుమ్మలపల్లిలో పూర్ణకంటి కృష్ణయ్య పూరి గుడిసె కూలిపోయింది. లోపల నిద్రించిన కృష్ణయ్య, నాగరత్నం దంపతులపై ఫ్యాన్, గుడిసె కర్రలు పడుతుండగా పక్కకు తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. ఇదే గ్రామానికి చెందిన సారకాయల పెద్ద కృష్ణ, కొత్తపల్లి ప్రభాకర్ ఇంటి రేకులు ఎగిరిపోయాయి. ప్రభాకర్ భార్య సుహాసినిపై రేకుల ముక్కలు పడగా గాయాలయ్యాయి. అలాగే, తుమ్మలపల్లిలోని పీఎస్‌లోని చెట్టు విరిగి అంగన్‌వాడీ కేంద్రంపై పడింది. కొణిజర్ల – పల్లిపాడు జాతీయ రహదారిపై ఓ భారీ వృక్షం విరిగి పడగా మూడు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు జేసీబీ సాయంతో చెట్టును తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరించారు. గాలిదుమారానికి చెట్ల కొమ్మలు విరిగి పడగా కొణిజర్ల సమీపంలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.



తుమ్మలపల్లిలో కూలిన పూరిల్లు

కామేపల్లి మండలంలో..



ఊట్కూర్‌లో విరిగిపడిన స్తంభం

కామేపల్లి: కామేపల్లి మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి ఈదురు గాలితో కూడిన వర్షం కురిసింది.గాలి దుమారానికి పలు గ్రామాల్లో రహదారుల వెంట చెట్లు విరిగిపడగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగి సరఫరా నిలిచిపోయింది. కొన్ని చోట్ల చెట్లు రహదారులకు అడ్డంగా పడడంతో రాకపోలకు అంతరాయం ఏర్పడింది. మామిడి తోటల్లో కాయలు రాలిపోగా, ధాన్యం,, మిర్చి తడిశాయి

రఘునాథపాలెం మండలంలో..



నేలకొరిగిన బొప్పాయి తోటలో రైతులు

రఘునాథపాలెం: గాలివానతో రఘునాథపాలెం మండలం సూర్యతండాకు చెందిన వాంకుడోత్ బాలు, మరికొందరు సాగు చేసిన పది ఎకరాల్లో బొప్పాయి తోటలు నేలకొరిగాయి. కాయ చేతికొచ్చే దశలో కూలడంతో తీరని నష్టం మిగిలిందని వాపోయారు. తోటలను ఉద్యాన శాఖాధికారి నగేశ్ పరిశీలించారు.

కారేపల్లి మండలంలో...



ధ్వంసమైన బొప్పాయి తోటలో రైతు

కారేపల్లి: గాలివాన బీభత్సానికి కారేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. గిద్దెవారిగూడెంతో స్తంభాలు కూలగా సరఫరా నిలిచిపోయింది. కారేపల్లి క్రాస్‌లోని రైతు భూక్యా శంకర్‌కు చెందిన ఐదెకరాల్లో బొప్పాయి తోటలోని చెట్లు కుప్పకూలడంతో రూ.10లక్షల మేర నష్టం ఎదురైందని రైతు వాపోయాడు.

ఫలితాలు ఎందుకు తగ్గాయి?



నేలకొండపల్లిలో బాలికల ఎస్సీ గురుకుల కళాశాల

- ఎస్సీ గురుకులాల ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులు
- ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం తగ్గడంపై వివరణ ఇవ్వాలని ఆదేశం
- జాబితాలో ఉమ్మడి జిల్లాలోని 14 కళాశాలలు

ఖమ్మంమయూరిసెంటర్: ఇంటర్మీడియట్ ఫలితాలు ఇటీవల వెల్లడి కాగా.. పలు సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గడంపై సంస్థ కార్యదర్శి దృష్టి సారించారు. గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తూ, నిరంతర పర్యవేక్షణలో బోధించినా విద్యార్థులు ఫెయిల్ కావడంతో ప్రిన్సిపాళ్లపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే 80శాతం కన్నా తక్కువ ఉత్తీర్ణత శాతం నమోదైన గురుకులాల ప్రిన్సిపాళ్లకు ఎస్సీ సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి డాక్టర్ వీ.ఎస్.అలగు వర్షిణి తాజాగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ జాబితాలో ఉమ్మడి జిల్లాలోని పలు గురుకులాలు కూడా ఉన్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలకు సంబంధించి 12, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ఆరు గురుకులాల ప్రిన్సిపాళ్లకు నోటీసులు జారీ అయ్యాయి.

అన్ని వసతులు.. నిపుణులైన అధ్యాపకులు

పేద విద్యార్థులకు మెరుగైన బోధన అందించేలా ఉన్నత విద్యార్హతలు కలిగిన అధ్యాపకులను నియమించడంతో గురుకులాల్లో అన్ని వసతులు కల్పించినా ఆశించిన స్థాయిలో ఉత్తీర్ణత నమోదు కాకపోవడంపై అధికారులు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే పలు ప్రశ్నలు సంధిస్తూ ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 'గ్రామీణ ప్రాంతాల నుంచివచ్చే అణగారిన, షెడ్యూల్ కులాల పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించడానికి ప్రభుత్వం తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థలను స్థాపించింది. సొసైటీ అధికఅర్హత కలిగిన ఉపాధ్యాయులుగా నియమించింది. విద్యార్థులు దాదాపు ఐదేళ్లుగా రెసిడెన్షియల్ పాఠశాలలో ఉన్నారు. 90శాతం మంది పదో తరగతిలో ఉత్తీర్ణులైతే, ఇంటర్‌లో 100శాతం ఉత్తీర్ణత సాధించలేదు. ప్రిన్సిపాళ్లు చిత్తశుద్ధితో కృషి చేస్తే విద్యార్థులందరినీ పాస్ స్థాయికి సులభంగా తీసుకురావొచ్చు. అయినా అలా ఫలితాలు ఎందుకు రాలేదు'అని నోటీసుల్లో ప్రశ్నించారు.

చర్యలు ఎందుకు తీసుకోవద్దు..

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 80 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత నమోదైన ఎస్సీ గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఇటీవల నోటీసులు అందాయి. వీరి నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో కారణం చెప్పాలని అందులో పేర్కొన్నారు. నోటీసులకు ప్రిన్సిపాళ్లు పది రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేదంటే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

80శాతం కన్నా తక్కువ ఉత్తీర్ణత నమోదైన కళాశాలలు

ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి 80 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత నమోదైన కళాశాలల వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి బాలికలు కళాశాలలో 79.75 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, అన్నపురెడ్డిపల్లి(బాలుర)లో 78.95, వైరా(బాలికలు)లో 77.78, ములకలపల్లిలో 75.34, తిరుమలాయపాలెం(బాలుర)లో 67.92, ఎర్రుపాలెం(బాలికలు)లో 56.94, ముదిగొండ(బాలుర)లో 55.07, ఇల్లెందు (బాలికల)లో 54.35, భద్రాచలం(బాలికలు)లో 54.29, దమ్మపేట(బాలుర)లో 47.27, మణుగూరు (బాలుర)లో 33.33, సత్తుపల్లి(బాలుర)లో 30.56 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక ద్వితీయ సంవత్సరానికి వచ్చేసరికి భద్రాచలం బాలికల కళాశాలలో 79.41 శాతం, పాల్వంచ(బాలుర)లో 76.47, సత్తుపల్లి(బాలుర)లో 72.22, వైరా(బాలికలు)లో 67.11, ఇల్లెందు(బాలికలు)లో 66.67, మణుగూరు(బాలికలు) కళాశాలలో 47.06శాతంగా ఉత్తీర్ణత నమోదైంది.

రైతులకు అండగా నిలవాలి



మాట్లాడుతున్న డీఏఓ పుల్లయ్య, పక్కన అధికారులు

రఘునాథపాలెం: రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు మాత్రమే అమ్మడంతో పాటు మోతాదుకు మించి వినియోగంతో అనర్థాలపై డీలర్లు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. కొన్నాళ్లుగా డీలర్లకు వివిధ అంశాలపై ఇస్తున్న శిక్షణ ముగింపు సమావేశాన్ని గురువారం రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలోని రైతువేదికలో నిర్వహించారు. తొలుత వివిధ కేటగిరీల్లో ప్రతిభ కనబర్చిన డీలర్లు మందడపు భార్గవ్, ఏలూరు రాకేష్, సాయికృష్ణ, సిలువేరు వేణుగోపాల్, అజ్మీరా నరేన్, లక్ష్మీనారాయణను సన్మానించాక డీఏఓ మాట్లాడారు. రైతులతో నేరుగా సంబంధాలు కలిగి ఉండే డీలర్లు వారు లాభాల బాట పట్టేలా అండగా నిలవాలని తెలిపారు. ఆత్మ ఏడీఏ అభిమన్యుడు, జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రావు మాట్లాడుతూ అధిక మోతాదులో ఎరువుల వినియోగాన్ని నివారించడమే కాక నాణ్యమైన పంటల ఉత్పత్తికి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. రైతు శిక్షణ కేంద్రం ఏడీ మిట్టపల్లి సతీష్, ఖమ్మం అర్బన్ ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడగా అధికారులు డి.అరుణకుమారి, అరుణజ్యోతి, ఇంటూరు భాస్కరరావు, కర్నాటి ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్యం వికటించి మహిళ మృతి

సత్తుపల్లిలో ఆస్పత్రి ఎదుట ఆందోళన



ఆస్పత్రి ఎదుట రోదిస్తున్న మృతురాలి బంధువులు



జ్యోత్స్న (ఫైల్)

సత్తుపల్లి: శస్త్రచికిత్స జరిగిన గంటల్లోనే మహిళ మృతి చెందగా.. ఆస్పత్రి ఎదుట ఆమె బంధువులు ఆందోళనకు దిగారు. గురువారం జరిగిన ఈ ఘటన వివరాలను మృతురాలి భర్త పి.మారేశ్వరరావు వెల్లడించారు. ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం కోటపాడుకు చెందిన పి.జ్యోత్స్న(24) కడుపు నొప్పితో బాధపడుతుండగా బుధవారం రాత్రి సత్తుపల్లిలోని ఆల్ఫా స్కానింగ్ సెంటర్‌కు తీసుకొచ్చారు. అక్కడ పరీక్షించిన రేడియాలజిస్ట్ పరిస్థితి విషమంగా ఉందని, ఎదురుగా ఉన్న ఆస్పత్రికి వెళ్లాలని సూచించగా.. ఎస్వీసీ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ పరీక్షల అనంతరం పిండం గర్భసంచికి బదులు పేగులోకి వెళ్లిందని, అది పగిలి రక్తస్రావమైందని డాక్టర్ సరికొండ హర్షిత్ తెలిపారు. ఆపరేషన్ చేసేందుకు కుటుంబీకులు అంగీకరించగా మరో వైద్యుడితో కలిసి శస్త్రచికిత్స చేసిన హర్షిత్ పరిస్థితి మెరుగుపడిందని చెప్పాడు. కానీ గురువారం ఉదయం జ్యోత్స్న పరిస్థితి ఆందోళన కరంగా ఉందని కుటుంబీకులు ప్రశ్నించగా మత్తు ప్రభావం కావొచ్చని బదులిచ్చాడు. ఆ కాసేపటికి వైద్యుడు ఆమె ను పరీక్షించి హార్ట్ ఫెయిల్ అయి చనిపోయిందని చెప్పడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు.

మృతదేహం చూపించకుండా..

ఉదయం 10 గంటలకు జ్యోత్స్న మృతి చెందగా, ఆమె కుటుంబీకులకు రాత్రి ఏడు గంటల వరకు మృతదేహాన్ని చూపించలేదు. అంతసేపు ఆస్పత్రి ఎదుట రోదిస్తూ ఆందోళనకు చేపట్టారు. ఆస్పత్రిలో వెంటిలేటర్, ఐసీయూ లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కాగా, జ్యోత్స్నకు రెండేళ్ల కుమార్తె ఉండగా, ఆమె మరిది పెళ్లి కోటపాడులో బుధవారం రాత్రి జరుగుతుండగానే ఆరోగ్యం విషమించడంతో సత్తుపల్లి తీసుకొచ్చారు. ఇక్కడ ఆమె మృతి చెందగా కుటుంబంలో విషాదం నెలకొంది. అయితే, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆమె బంధువులతో డాక్టర్ల బృందం చర్చలు జరిపినట్లు తెలిసింది. చివరకు రాత్రి పరస్పరం అంగీకారం కుదిరినట్లు తెలుస్తుండగా, జ్యోత్స్న మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకెళ్లారు. ఈమేరకు ఎస్సైలు రఘు, కవిత ఆధ్వర్యాన బందోబస్తు నిర్వహించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మధిర: మండలంలోని ఆత్కూరులో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో గురువారం మృతి చెందింది. గ్రామానికి చెందిన మీనుగు పెంటయ్య, కనకమ్మ(45) దంపతులు కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. కుటుంబ కలహాలతో ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని తెలిసింది. అయితే, మద్యం మత్తులో భర్త హత్య చేసి ఉంటాడని కొందరు అనుమానాలు వ్యక్తం చేయడంతో మధిర టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ కళాశాల బస్సు ఢీకొని మహిళ..

ఖమ్మంరూరల్: మండలంలోని సత్యనారాయణపురం వద్ద ద్విచక్రవాహనాన్ని ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు ఢీకొనగా ఓ మహిళ మృతి చెందింది. సాయిగణేష్‌నగర్‌కు చెందిన నాగమణి (56) కోదాడలో ఇరిగేషన్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. విధుల్లో భాగంగా బుధవారం కోదాడ వెళ్లిన ఆమె తిరిగి బస్సులో వస్తూ ముల్కలపల్లి క్రాస్‌రోడ్డు వద్ద దిగింది. అక్కడి నుంచి బైక్‌ను లిఫ్ట్ అడిగి వెళ్తుండగా సత్యనారాయణపురం వద్ద వెనుక నుంచి కళాశాల బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగమణికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఖమ్మంకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిందని సీఐ ముష్క రాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..

మధిర: మండలంలోని రొంపిమళ్లకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ శీలం మల్లికార్జున్‌రెడ్డి(33) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఆయన ఇంట్లో కూలర్‌కు బుధవారం రాత్రి ప్లగ్ పెడుతుండగా షాక్‌కు గురయ్యాడు. ఆయన వివాహం కాకపోగా, గతంలోనే తండ్రి మరణించడంతో తల్లితో కలిసి నివాసముంటున్నాడు. ఘటనపై మల్లి కార్జున్‌రెడ్డి తల్లి ఫిర్యాదుతో మధిర రూరల్ టౌన్ ఎస్ఐ లక్ష్మీభార్గవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

పెనుబల్లి: పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వేంసూరు మండలం కొండేగట్లకు చెందిన రావూరి రాము తన మేనమామ అయిన దంతాలపల్లి ప్రభాకర్ ఇంట్లో శుభకార్యం ఉండగా బుధవారం గంగదేవిపాడు వచ్చాడు. అక్కడి కిరాణ షాప్‌నకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన బాణోత్ నరేష్, ఇస్లావత్ చక్రి గతంలో జరిగిన గొడవపై చర్చిస్తుండగా ప్రభాకర్ వచ్చి రామును తీసుకెళ్లాడు. దీంతో మనస్తాపానికి గురై గ్రామ సమీపంలో పురుగుల మందు తాగగా కల్లూరుకు, ఖమ్మం తరలించిచికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందాడు. ఘటనపై ఆయన మేనమామ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరిశీలన

ఖమ్మంరూరల్: మండలంలోని కస్నాతండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి గంగాధర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిల్వఉన్న ధాన్యం వివరాలు ఆరా తీసిన ఆయన ఎప్పటికప్పుడు కాంటా వేయించి మిల్లులకు తరలించాలని సిబ్బందికి సూచించారు. రిజిస్ట్రార్ ఉషశ్రీ, ఏదులాపురం పీఏసీఎస్ చైర్మన్ జర్పుల లక్ష్మణ్‌నాయక్, రైతులు మాలోత్ శంకర్ పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో ఆనందం...

ఖమ్మం స్పోర్ట్స్: రెండున్నర దశాబ్దాలుగా క్రీడాకారులు ఎదురుచూస్తున్న సింథటిక్ ట్రాక్ కల ఎట్టకేలకు నెరవేరుతోంది. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రూ.8.50కోట్ల వ్యయంతో ట్రాక్ నిర్మాణానికి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే ట్రాక్ పనులు చేపడుతున్నారు. కాగా, ట్రాక్ నిర్మాణంలో ఎనిమిది లైన్లకు ప్రతిపాదించగా, తొమ్మిదో లైన్ నిర్మాణానికి కూడా కృషి చేస్తున్నామని డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి తెలిపారు. ఏదిఏమైనా త్వరలోనే సింథటిక్ ట్రాక్ అందుబాటులోకి రానుండడంతో క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందుతుందని చెబుతున్నారు.

అనుమతి లేకుండానే చికిత్స, వైద్యుడిపై కేసు



కంటి ఆస్పత్రిలో విచారణ చేస్తున్న డీఎంహెచ్ఓ

వైరా: మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) సర్టిఫికెట్ లేకుండా వైద్యం చేస్తున్న వైరా వాసిపై గురువారం కేసు నమోదైంది. వైరాకు చెందిన మోహనరావు కిర్గిస్తాన్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేశాక, ఎంసీఐ సర్టిఫికెట్ లేకుండానే ఆస్పత్రి ఏర్పాటు చేశారు. ఈ విషయమై అందిన ఫిర్యాదుతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవి నేతృత్వాన గురువారం తనిఖీలు చేపట్టారు. ఈమేరకు మోహన్‌రావుపై కేసు నమోదు చేయడమేకాక చట్టపరమైన చర్యల నిమిత్తం వైద్య, ఆరోగ్య శాఖకు నివేదిక ఇచ్చినట్లు ఏసీపీ తెలిపారు.

కంటి వైద్యశాల సీజ్..

వైరా ఆర్టీసీ బస్టాండ్ వెనకాల ఉన్న హనోక్ కంటి వైద్యశాలను డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతిబాయి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమతులు లేవని.. కనీస అర్హత లేని సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నట్లు తేలడంతో ఆస్పత్రి సీజ్ చేసి, బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు.

90 గంజాయి చాక్లెట్లు స్వాధీనం

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపుల గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులకు అమ్ముతున్న 90 గంజాయి చాక్లెట్ల(517 గ్రాములు)ను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. సాయిశ్రీ గ్రానైట్ ఫ్యాక్టరీ సమీపాన తిరుమలాయపాలెంకు చెందిన కొమ్ము ప్రభాకర్, యూపీకి చెందిన చోటాకం అక్కడి కార్మికులకు గంజాయి చాక్లెట్లు అమ్ముతున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా చాక్లెట్లు స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

మద్యానికి బానిసైన ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ఖమ్మంఅర్బన్: ఆటో నడుపుతూ జీవనం సాగించే వ్యక్తి మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం దమ్మపేటకు చెందిన చిలంకూరి ఫణికుమార్(40) ఏడాది క్రితం తన భార్యతో కలిసి ఖమ్మం పాండురంగాపురం వచ్చాడు. ఇక్కడ అద్దె ఇంట్లో ఉంటూ ఆటో నడుపుతుండగా, కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆటో నడపకపోగా కుటుంబ పోషణలో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈక్రమంలోనే గత నెల 25న ఎలుకల మందు కలిపిన మద్యం తాగిన ఫణికుమార్‌ను కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఘటనపై మృతుడి తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు.